అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పద్మారావు

సికింద్రాబాద్, జూన్ 10 : పేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు లభించేలా కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ మున్సిపల్ డివిజన్లకు చెందిన 82 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు సోమవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పదేళ్లుగా ప్రతి ఇంటికీ వివిధ సంక్షేమ పథకాలను అందించగలిగామన్నారు. అన్ని వర్గాలకు చెందిన వారికి ప్రయోజనం చేకూర్చామన్నారు. ఓట్లు, ఎన్నికలు, రాజకీయాలతో నిమిత్తం లేకుండా అన్ని వేళల్లో ప్రజలతో సంబంధాలు కలిగి ఉన్నామని పద్మారావు గౌడ్ వెల్లడించారు.

ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే సీతాఫల్‌మండిలోని తమ కార్యాలయంలో అన్ని పని వేళల్లో సంప్రదించాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎవరికీ చిల్లిగవ్వ కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, సునీత, ప్రసన్న లక్ష్మి, కంది శైలజ, నేతలు రామేశ్వర్ గౌడ్, తహసీల్దార్ పద్మా సుందరి, అధికారులు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం లబ్ధిదారులతో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

రమేశ్‌బాబుకు బంగారు పతకం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 10: ఇటీవల గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలలో 65 ఏళ్ల కేటగిరీలో 70 ఏళ్ల రమేశ్‌బాబు బంగారు పతకం సాధించారు. పతకం సాధించిన ఆయనను శాలిబండ సైక్లింగ్ క్లబ్, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓయూ సైక్లింగ్ స్టేడియంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ 14 రాష్ట్రాల నుంచి 400 మంది పరుగుపందెంలో పోటీ పడగా, తాను మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు వివరించారు. గతంలో వివిధ పోటీలలో ఇప్పటికే ఈ కార్యక్రమంలో శాలిబండ సైక్లింగ్ క్లబ్, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బేగంపేట్, జూన్ 10: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయం హుండీని దేవాదాయశాఖ అధికారులు సోమవారం లెక్కించారు. రెండు నెలల 15 రోజులకు గానూ హుండీ ఆదాయం రూ. 23,91,023 లభించినట్టు దేవాలయం ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి,ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, మాజీ ధర్మకర్తలు, బ్యాంక్ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామికి గర్భాలయంలో సోమవారం వేదపండితులు మహాన్యాస రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ చైర్మన్ నాగలింగం శర్మ తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగ బాలు



గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఓయూలోని సరస్వతీ దేవాలయం ఆవరణలో మొక్కలు నాటిన విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 10: గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగ బాలు సోమవారం తన పుట్టినరోజును పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఉస్మానియా యూనివర్సిటీలోని సరస్వతీ దేవాలయం ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం బాలు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణలో అప్పటి సీఎం కేసీఆర్ హరితహారంలో భాగంగా కోట్లాది మొక్కలు నాటి రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడలో జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను తీసుకొచ్చి, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, మిగిలిన వారిని భాగస్వాములను చేసేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చాప భాస్కర్, బీఆర్ఎస్వీ నేతలు కొంపల్లి నరేశ్, పులి శ్రీకాంత్, వెంకటేశ్, మన్నె ప్రభాకర్, తుంగ అక్షయ్‌కుమార్, వినోద్, నవీన్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తా

బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ భేటీలో ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, జూన్ 10: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బోర్డు పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎనిమిది వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అడుగులు వేయబోతున్నామని, ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర సర్కారు ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం పేదలకు అందే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతామని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే ఫలాలు అందుతాయని స్పష్టం చేశారు. బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు సంకి రవీందర్, సదానంద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు బీజేపీ నాయకుల శుభాకాంక్షలు

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఈటల రాజేందర్‌ని పలువురు నాయకులు సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈసందర్భంగా శాలువాలతో ఘనంగా సత్కరించారు.సికింద్రాబాద్ బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ,మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగ పాణి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.– సికింద్రాబాద్

విజయోత్సవ ర్యాలీ

కంటోన్మెంట్ రెండో వార్డులో ఎమ్మెల్యేగా శ్రీ గణేష్ గెలుపొందిన నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు.అనంతరం పూలమాలతో సన్మానించి, కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. –బొల్లారం,జూన్ 10

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

శ్రీనివాస్‌గుప్తాను సన్మానిస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, జూన్ 10 : పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన విధంగా గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. సోమవారం గాంధీనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రం శ్రీనివాస్ గుప్తాను సన్మానించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, నాయకులు శ్రీకాంత్, జీవై గిరి, రవిశంకర్ గుప్తా, బి.కిరణ్, ఎంబీ.కృష్ణ, కుమారస్వామి, రచ్చ నరేశ్, సాయి చాణిక్యరెడ్డి పాల్గొన్నారు.

చెట్లకొమ్మలు కొట్టారు..తొలగించడం మరిచారు..

ఉప్పల్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయన్న కారణంతో చెట్ల కొమ్మలను తొలగించిన విద్యుత్ అధికారులు వాటిని అక్కడి నుంచి తొలగించడం మరిచిపోయారు. దీంతో కాలనీలోని రోడ్లను ఆక్రమిస్తూ, వర్షాల నేపథ్యంలో రోడ్లపైకి చేరుతున్నాయి. కాలనీలోని వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా మారాయి. మరికొన్ని చోట్ల పుట్‌పాత్‌లపై కొమ్మలను వేయడంతో నడవడానికి వీలులేకుండా మారిం ది.సరస్వతికాలనీ, శ్రీరమణకాలనీ, సాయిచిత్రనగర్, తదితర ప్రాంతాల్లో చెట్టుకొమ్మలను తొలగించకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

మైత్రీ కమిటీ సమావేశంలో చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిత్రంలో కార్పొరేటర్లు రాసూరి సునీత, సామల హేమ తదితరులు

అడ్డగుట్ట, జూన్ 10 : బక్రీద్ పండుగను ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ ఉన్న నేపథ్యంలో చిలకలగూడ డివిజన్ పరిధిలోని చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పీస్, మైత్రీ కమిటీ సభ్యులతో సోమవారం సాయంత్రం నామాలగుండులోని బీఎన్ ఆర్ గార్డెన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కమిటీ సభ్యులకు సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మతసామరస్యానికి ప్రతీకగా పండుగలను జరుపుకోవాలని అన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసకుంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని అందజేయాలని ఆయన సూచించారు. ప్రజలు, మైత్రీ కమిటీ సభ్యులు సమన్వయంతో వేడుకలు జరిగేలా చూడాలని ఆయన తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిలకలగూడ సీఐ అనుదీప్, లాలాగూడ, వారాసిగూడ సీఐలు, సీతాఫల్‌మండి, మెట్టుగూడ కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, మైత్రీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన మైత్రీ కమిటీ సభ్యులు

సఫిల్‌గూడ చెరువును అభివృద్ధి చేయాలి

హెచ్ఎండీఏ జాయింట్ డైరెక్టర్ ఆమ్రపాలికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువును అభివృద్ధిచేయాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్‌లో ప్రజావాణిలో సఫిల్‌గూడ చెరువును అభివృద్ధిచేయాలని కోరుతూ హెచ్ఎండీఏ జాయింట్ డైరెక్టర్ ఆమ్రాపాలికి కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌లో పబ్లిక్ టాయిలెట్స్, పుట్‌పాత్, లైట్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులోని గుర్రపు డెక్క వల్ల దోమల వృద్ధి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే గుర్రపు డెక్కను తొలగించి, సుందరీకరించాలన్నారు. నాలాలలో పూడిక తీతపనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

చిక్కడపల్లి : బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన నియోకర్సర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతలు నిర్వహిస్తున్నట్లు నియోకర్సర్ అడ్మిన్ మేనేజర్ పి.రాణాప్రతాప్ తెలిపారు. కంప్యూటర్ బేసిక్స్, ఇంగ్లిష్, తెలుగు టైపింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 95154 28749లో సంప్రదించవచ్చునని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

శామీర్‌పేట: గడువు దాటిన నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ ఏడీఏవవెంకటరాంరెడ్డి హెచ్చరించారు. మూడుచింతలపిల్లి మండలంలోని విత్తన దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. నకిలీ విత్తనాలు, గడువు దాటిన విత్తనాల విక్రయాన్ని అరికట్టేందుకే టాస్క్‌ఫార్స్ టీమ్ తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. రైతులకు విత్తనాలు విక్రయించిన వెంటనే బిల్లులు ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు.

ఇన్నోవేషన్లకు ప్రోత్సాహం

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ ఐటీఐల విద్యార్థులకు ఆయా ట్రేడ్‌లలో విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఇన్నోవేషన్లకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ సనత్‌నగర్ ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం విజయనగర్‌కాలనీ మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్ ఆవరణలో ఉన్న సనత్‌నగర్ ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లలో మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రూపొందించిన ఇన్నోవేషన్లను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వాయిస్ కంట్రోల్ రోబోట్ కార్ యూజింగ్ ఆర్డినో, ఆర్డినో బోర్డు, మోటార్ షీల్డ్, బ్యాటరీలు, బ్లూటూత్ సెన్సార్, టూ మోటార్ విత్ వీల్‌లను సహాయ శిక్షణాధికారి శీలవాణి నేతృత్వంలో సుమారు ఐదుగురు విద్యార్థులు రూపొందించినట్లు తెలిపారు. ఈ రోబోట్ ఆర్డినో మొబైల్‌లో వాయిస్‌తో ఎలా చెబితే అలా వెళ్తుందన్నారు.

రాధిక కాలనీలో శంకర్‌యాదవ్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, నాయకులు పల్లె లక్ష్మణ్ గౌడ్ తదితరులు



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే టి. పద్మారావు, మాజీ మంత్రి మహమూద్ అలీ, చిత్రంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

తలసాని శంకర్ యాదవ్ కన్నుమూత

నివాళులర్పించిన మాజీ మంత్రులు హరీష్ రావు, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు

మారేడ్‌పల్లి, జూన్ 10 : మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ (61) అనారోగ్యంతో మృతి చెందాడు. శంకర్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. శంకర్ యాదవ్ ప్రస్తుతం మోండా మార్కెట్ అధ్యక్షులుగా, బోయిన్‌పల్లి కూరగాయల మర్కెట్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

శంకర్ యాదవ్ మృతదేహానికి ప్రముఖుల నివాళులు

అనారోగ్యంతో మృతి చెందిన తలసాని శంకర్ యాదవ్‌కు పలువురు ప్రముఖులు ,మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు పూల మాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పలువురు పరామర్శించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మహమూద్ అలీ, మాజీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్, ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్యే దానం నాగేందర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బం డ ప్రకాశ్ ముదిరాజ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, అనిల్ కూర్మాచలం, రజనీ సాయిచంద్, మేడే రాజీవ్ సాగర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బీఆర్ఎస్ ఇన్‌చార్జి నివేదిత, బీజేపి నాయకులు చీకోటి ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, రాంబాబు యాదవ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు హేమలత, టి. మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి, అత్తిలి అరుణ గౌడ్, ఆకుల రూప, వివిధ నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల నా యకులు, కార్యకర్తలు శంకర్ యాదవ్ కు పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తల్లిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

శంకర్ యాదవ్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

తలసాని శంకర్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

శంకర్‌యాదవ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అమీర్‌పేట్ మాజీ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంప్ రన్నరప్‌గా..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, ఆట ప్రతినిధి జూన్ 10 : నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్ రన్నరప్ టైటిల్‌ను హైదరాబాద్ సూపర్ కింగ్స్‌గా హాస్పిటల్స్ జట్టు నిలిచింది. ముంబై క్రికెట్ స్పార్టాన్స్ హాస్పిటల్స్ జట్టు టైటిల్‌ను దక్కించుకుంది. సోమవారం రాజేంద్రనగర్‌లోని విజయ్ ఆనంద్ క్రికెట్ మైదానంలో మైటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నంద పాండే ఆధ్వర్యంలో జరిగిన ఫైనల్స్‌లో ముంబై హాస్పిటల్స్ జట్టు ఐదు వికెట్ల తేడాతో హైదరాబాద్ హాస్పిటల్స్ జట్టు పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ హాస్పిటల్స్ జట్టు 143 పరుగులు చేసింది. ముంబై హాస్పిటల్స్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. విజేతలకు నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్‌ను ఫారెస్ట్ నేషన్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శరత్ నలమోతు, మైటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నంద పాండే, కో డైరెక్టర్ నిఖిల్ సంపత్, ఇంతియాజ్ బేగ్ తదితరులు ట్రోఫీని అందజేశారు.

ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్

అథ్లెటిక్స్ చాంప్‌నకు శ్రీకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, ఆట ప్రతినిధి జూన్ 10: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్–2024 ఎఫిషియెన్సీ స్కిల్ రన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. వరప్రసాద్, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్–2024 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ ప్రారంభించారు. పురుషుల విభాగం 100, 800 మీటర్ల పరుగులతో పాటు షాట్‌పుట్, లాంగ్ జంప్ నిర్వహించారు. అనంతరం నైపుణ్యం పరీక్షలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జే.ప్రభాకర్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి మనోవర్ పాల్గొన్నారు.